క్లుప్తంగా

సమస్యలపై కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయండి

నగర కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రజలు సమస్యలపై నగరపాలక సంస్థ 24 గంటలు అందుబాటులో ఉండే కాల్ సెంటర్‌కి ఫిర్యాదు చేయవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస, సహాయ చర్యల కోసం గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు, కార్మికులు అధిక సంఖ్యలో వెళ్లిన నేపథ్యంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలో ఏ సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. వరదల దృష్ట్యా నగర పజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. సమస్యను 0863-2345103, 104 నంబర్లకు కాల్ చేయడం లేదా 98499 08391 నంబర్ కి వాట్సప్ చేయవచ్చని పేర్కొన్నారు. నగర ప్రజలు నగరపాలక సంస్థ సరఫరా చేసే తాగునీటిని విధిగా కాచి చల్లార్చి వినియోగించాలని కోరారు.

విఘ్నేశ్వరుడికి జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు



గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడిని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో 7వ గణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

కళ్లకు నల్లరిబ్బన్‌లు కట్టుకుని స్టాఫ్‌నర్సుల నిరసన




గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు సోమవారం సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద కళ్లకు నల్లరిబ్బన్ కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం తమగోడు పట్టించుకోవడం లేదని, 15 ఏళ్లుగా రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల పోస్టుల నోటిఫికేషన్ లేకపోవడంతో అవస్థలు పడుతున్నామంటూ బాధలు తెలిపేలా కళ్లకు గంతలు కట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబరు 115ను వెనక్కు తీసుకోవాలని, కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలు చేశారు. తమ డిమాండ్‌లు నెరవేరే వరకు నిరసన కార్యక్రమం కొనసాగుతోందని, త్వరలోనే అత్యవసర వైద్య సేవలు మినహా ఇతర వైద్య సేవలు బంద్ చేస్తామని ఆంధ్రప్రదేశ్ నర్సుల పోరాట కమిటీ నేతలు తెలిపారు. వర్షంలో తడుస్తూ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు నిరసన కొనసాగించారు. నిరసన కార్యక్రమంలో కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, బి.శివమ్మ, వి.విజయ్‌కుమార్, హైమావతి, కుసుమకుమారి, కరుణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మంచుకొండల్లో వినాయకుడు



సత్రం రోడ్డులో గణనాథుడు..



ఆంజనేయపేటలో శివపార్వతులతో గణనాథుడు..

జై జై గణేశా..

నగరంలో వినాయక నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద సోమవారం విశేష పూజలు నిర్వహించారు.


–సాక్షి, ఫొటోగ్రాఫర్ గుంటూరు



నల్లచెరువులో టిఫిన్ బండిపై మట్టి వినాయకుడు



ఏలూరు బజారులో బెలూన్స్‌తో వినాయకుడికి అలంకరణ



కొరిటెపాడులో శంకుచక్రాలతో వినాయకుడు

ఘనంగా గణనాథుని నిమజ్జనోత్సవం




గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంట మంత్రివారివీధిలోని అయ్యప్ప రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో కొలువైన గణనాథుడు సోమవారం నిమజ్జనానికి బయలుదేరివెళ్లారు. మూడురోజుల పాటు విశేషంగా పూజలు, గణపతి హోమాలు నిర్వహించిన అపార్ట్‌మెంట్ వాసులు మేళ తాళాలు, భాజా భజంత్రీలతో గణనాథుడిని నిమజ్జనానికి తీసుకువెళ్లారు. వేద పండితులు తాతాచార్యులు పూజలు నిర్వహించిన అనంతరం లడ్డూ వేలం పాటలో అప్పలరాము రూ.40,120, బాల గణేష్ లడ్డూను మద్ది రవికుమార్ రూ.26 వేలకు దక్కించుకున్నారు. ఈసందర్భంగా అన్నదానం నిర్వహించి, భారీ ఊరేగింపుతో నిమజ్జనోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాసరావు, మద్ది రవికుమార్, అనిల్, రామాంజనేయులు, శేఖర్, కిషోర్‌తో పాటు మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

పట్నంబజారు: అప్పుల బాధతో యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శీలంవారివీధిలో నివాసం ఉండే షేక్ నాగూర్(26) ఓ ప్రైవేటు కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అప్పులు అవడంతో మనస్తాపానికి గురైన నాగూర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లాలూసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్షణికావేశంలో జీవితాలు బలి చేసుకోవద్దు

- ఆత్మహత్య చేసుకోవాలనుకునేవారిని గమనించాలి
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం



వరల్డ్ సుసైడ్ ప్రివెన్షన్ డే పోస్టర్లు

గుంటూరు మెడికల్: జీవన విధానం మారిపోయింది. ఉరుకులు పరుగుల జీవితం అయింది. సాంకేతిక రాకతో పని ఒత్తిడి పెరిగింది. మార్కెట్ మాయాజాలతో అదనపు హంగులు వచ్చేశాయి. దీంతో ఒత్తిడిని తట్టుకోలేని యువత క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో 15 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సువారే ఎక్కువ అని ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. ఆత్మహత్యలను నివారించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇంటర్‌నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్ సంస్థ సంయుక్తంగా 2003 నుంచి ప్రతి ఏడాది సెప్టెంబరు 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

ఈ లక్షణాలు కనిపిస్తాయి..

డల్‌గా ఉండటం, అందరితో కలవకుండా ఒంటరిగా కూర్చోవడం, కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపకుండా ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడడం, బరువు తగ్గిపోవడం, ముఖం దిగాలుగా ఉండటం, ఆహారం మానివేయడం, తదితర లక్షణాలు వ్యక్తుల్లో కనిపిస్తే తక్షణమే అప్రమత్తమై వారికి మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి. ఈ లక్షణాలు కనిపించేవారు హైరిస్క్ గ్రూపునకు చెందిన వారు.

కారణాలు....

భారతదేశంలో ఆత్మహత్యకు కుటుంబ సమస్యలు, అనారోగ్యం, ఆల్కహాలు, మాదక ద్రవ్యాలకు బానిసలవ్వటం, వైవాహిక సమస్యలు, ప్రేమ వ్యవహారాలు, పరీక్షల్లో అపజయాలు, ఒత్తిడి, కుంగుబాటు, ఆర్థిక సమ్యలు, నిరుద్యోగం, ఆస్తి తగాదాలు, బీదరికం, వివాహేతర సంబంధాలు, కుల, వర్గ వివక్షలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

వీరిని ఓ కంట కనిపెట్టాలి....

సామాజిక మాధ్యమాలలో, వార్తా పత్రికలలో, ఆత్మహత్యలు జరిగే విధానాన్ని అన్వేషించేవారిని, విచారం, దిగులు, దుఃఖం, ఎక్కువ కాలం ఉంటే అది ఆత్మహత్యకు దారి తీసే అవకాశముంది. సాధారణ ప్రవర్తనకు భిన్నంగా సడన్‌గా శాంతంగా ఉండడం, నిరుత్సాహంగా గడపడం చేస్తుంటే తేడాను గమనించాలి. గతంలో లాగా స్నేహితులతో కలవకుండా, ఆట పాటలలో పాల్గొనకుండా, దైనందిన పనుల్లో ఒంటరి తనంగా ఉండడానికి ఇష్టపడుతుంటే ఆ మార్పును ఆత్మహత్యకు సంకేతంగా పరిగణించాలి.

జీజీహెచ్‌లో బాధితుల వివరాలు...

గుంటూరు జీజీహెచ్‌లో ఆత్మహత్యా ప్రయత్నాలు చేసి చికిత్స పొందినవారు ప్రతినెలా 30 మందికిపైగా ఉంటున్నారు. తొమ్మిది నెలల కాలంలో 18 ఏళ్లలోపు వారు 24 మంది ఉన్నారు. 18 ఏళ్లు దాటిన వారిలో 283 మంది ఉన్నారు. మొత్తం 307 మంది క్షణికావేశంతో చనిపోయేందుకు ప్రయత్నించారు.

ముందస్తుగా గుర్తిస్తే నివారించవచ్చు...



ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం మానసిక రుగ్మత. అలాంటి ఆలోచన వచ్చిన వారు ముందుగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. ఇంట్లో తమపై ఉన్న బరువు బాధ్యతల్ని ఇతర కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. ఆస్తి, పాస్తుల వివరాలు వెల్లడి చేసి జీవితంలో ఎదగాలంటే ఎలా ఉండాలో జాగ్రత్తలు పిల్లలకు, కుటుంబ సభ్యులకు వివరిస్తారు. ఇలాంటివారిని మానసిక వైద్యులకు చూపించడం ద్వారా ఆత్మహత్యకు పాల్పడకుండా నివారించవచ్చు. కుటుంబ సభ్యులు చనిపోతామని బెదిరిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా తక్షణమే స్పందించాలి.

–డాక్టర్ వద్దాది వెంకటకిరణ్, జిల్లా అధ్యక్షుడు, మానసికవ్యాధుల నిపుణుల సంఘం

కోవిడ్ అనంతరం ఎక్కువ కేసులు...



ప్రతినెలా ఒక వైద్యుడి వద్దకు పది మంది వరకు ఆత్మహత్యాయత్నం చేసిన వారికి కౌన్సెలింగ్ చేసి చికిత్స అందిస్తున్నాం. ముందుగా వార్నింగ్ సిగ్నల్స్ ఇస్తారు. నాకు బతకాలని లేదని చెబుతారు. నెగిటివ్‌గా మాట్లాడారు. వాట్సాప్ స్టేటస్‌లో డెత్‌ల గురించి, ఇక సెలవు, బాయ్‌ఫర్ ఎవర్ పెడితే వారిని తక్షణమే మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. కోవిడ్ అనంతరం ఎక్కువ మంది మానసిక ఆందోళనకు గురై మానసిక వ్యాధి వైద్య నిపుణులను సంప్రదిస్తున్నారు.

– డాక్టర్ పసుపుల సాయికిరణ్, మానసిక వ్యాధి నిపుణుల సంఘం జిల్లా కార్యదర్శి

జీజీహెచ్‌లో ఉచితంగా వైద్యసేవలు....



గుంటూరు జీజీహెచ్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారు సాధారణ జీవితం గడిపేలా చేస్తున్నాం. ఆర్థికపరమైన సమస్యలు, సంసార జీవిత సమస్యలు, పిల్లలు మాట వినకపోవడం, ప్రయోజకులు కాకపోవడం, ఉద్యోగపరమైన ఒత్తిడులు, తాగుడు అలవాటు ఉండటం, కుటుంబంలో ఎవరైనా ఆత్మహత్య పాల్పడిఉండటం తదితర కారణాల వల్ల పలువురు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి వారిని ఓ కంట కనిపెట్టాలి.

– డాక్టర్ వి.సాయి కృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్ మానసికవ్యాధుల వైద్య విభాగం

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి

నెహ్రూ నగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో నగర కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్ విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు. సోమవారం ప్రజల నుంచి 23 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 5, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 2, ప్రజారోగ్య విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 3 చొప్పున ఫిర్యాదులు వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు నేత్రదానానికి ముందుకు రావాలి



అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దశ్యం

నెహ్రూ నగర్: ప్రజలంతా అపోహలు వీడి నేత్ర దానానికి ముందుకు రావాలని గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి దేవిరెడ్డి కిరణ్మయి అన్నారు. కేంద్ర ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర అనుబంధ సంస్థ జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నేత్ర దాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ నేత్రదానం, అంధత్వంపై అవగాహన నిర్వహించడంతో పాటు కంటి సమస్యలు రాకుండా ప్రజలను చైతన్య పర్చటమే లక్ష్యంగా జన చైతన్య సమితి బందం ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో విస్తత స్థాయిలో నేత్రాలపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రేమికుడు టీఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ మరణాంతరం తమ నేత్రాలను దానం చేయడం ద్వారా నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్న వారికి తిరిగి మరల కంటిచూపును ప్రసాదించవచ్చన్నారు. కార్యక్రమంలో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచి పరుచూరి పూర్ణచంద్రరావు, జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్, బెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

యువత ఆత్మహత్యలకు పాల్పడడం ఆందోళనకరం



మాట్లాడుతున్న డాక్టర్ ఆళ్ల ప్రశాంతి, పక్కన డాక్టర్లు ఉమాశంకర్, రూప

గుంటూరు మెడికల్: యుక్త వయస్సు వారే ఎక్కువ శాతం ఆత్మహత్యకు పాల్పడుతున్నారని తులసి మల్టీస్పెషాలిటీ హాస్పటల్ అధినేత, ఎనస్థీషియా స్పెషలిస్టు డాక్టర్ ఆళ్ల ప్రశాంతి అన్నారు. సోమవారం స్థానిక కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి నేటి వరకు తమ హాస్పిటల్‌లో పరిశోధన చేశామన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన వారిని 20 నుంచి 30 సంవత్సరాల వారే ఎక్కువగా ఉన్నట్లు తమ పరిశోధనలో తేలిందన్నారు. సెప్టెంబరు 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా తమ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ ప్రశాంతి వెల్లడించారు. డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ రూప పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

నగరంపాలెం: గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పీఎస్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ హనుమంతరావును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టులో విధులు నిర్వర్తించే ఓ ఉద్యోగినీకి అసభ్యకరమైన పోస్టులు పోస్ట్ చేస్తూ వేధిస్తున్నారనే ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. ఆరోపణలు నిర్ధారణ కావడంతో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. అయితే ఇద్దరి కానిస్టేబుళ్ల మధ్య తలెత్తిన వివాదాల దృష్ట్యా, కానిస్టేబుల్‌పై వేటుపడినట్లు సమాచారం.

వరద బాధితులకు దాతల సాయం



కలెక్టర్ నాగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న ఉద్యోగులు

గుంటూరు వెస్ట్: ఇటీవల భారీ వర్షాలు, వరద కారణంగా నష్టపోయిన వరద బాధితుల సహాయం కోసం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి రూ.80 వేల చెక్కును అందజేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్ బాషాతో పాటు నాయకులు కేవీఎస్ శివారెడ్డి, కరీముల్లా షాఖాదరి, పోతురాజు, పద్మజ, లీలాబాయి, రోజా కలెక్టర్‌కు చెక్కును అందజేశారు.

గుంటూరు ఎడ్యుకేషన్: వరద ముంపునకు గురైన లంక గ్రామాల ప్రజలను ఆదుకునేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ ఆధ్వర్యంలో రూ.90 వేల విలువైన నిత్యావసరాలతో కూడిన కిట్లను పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి సాంబశివరావు, కొండపనేని విజయకృష్ణ తెలిపారు. సోమవారం విద్యానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ పీపుల్ ఆఫ్ యాక్షన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధి విలాస విగ్రహదాసకు మరో రూ.రెండు లక్షల చెక్కు రూపంలో అందజేశారు. రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వడ్లమాని రవి మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్ కోసం రూ.రెండున్నర కోట్లను వెచ్చించి అతిపెద్ద వంటశాలను ఏర్పాటు చేసే బృహత్తర కార్యక్రమానికి రోటరీ శ్రీకారం చుట్టిందని తెలిపారు. క్లబ్ పూర్వపు గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. రోటరీ అచీవర్స్ క్లబ్ 2022-24 అధ్యక్షుడు పిడికిటి తిలక్‌బాబు, కోశాధికారి గుంటుపల్లి రఘునాథ్, ఎలెక్టెడ్ గవర్నర్ సోమవరపు రాంప్రసాద్, ప్రతినిధులు జి. వెంకట్, నల్లూరి రాంబాబు, సాయిబాబు, బ్రహ్మారెడ్డి, సుభాష్, భరత్‌రెడ్డి, పీవీ సత్యనారాయణ, శివరంజిని, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అధ్యక్షుడు గాలి సుబ్బారావు పాల్గొన్నారు.



అక్షయపాత్ర ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్..

గుంటూరు మెడికల్: నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవ్ విజయవాడ అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం వరద బాధితులకు సహాయం అందించారు. గుంటూరు టౌన్ ప్రెసిడెంట్ సయ్యద్ అబ్దుల్ హమీద్, 26 జిల్లాల ఇన్‌చార్జి ప్రెసిడెంట్ శివన్న, సయ్యద్ రషీద్ అహ్మద్, మైలవరం సైదులు, తిరువూరు శ్రీనివాస్, జి.కొండూరు సారి, భవాని శంకర్, కబీర్ పాల్గొన్నారు.

వర్సిటీ విద్యార్థులు..

ఏఎన్‌యూ: విజయవాడలోని వరద బాధితులకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యార్థులు, పరిశోధకులు సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆర్‌ఎస్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్‌లో ప్రభుత్వ ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న ఏఎన్‌యూ విద్యార్థులు ఈ సహాయ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని రాజరాజేశ్వరిపేట, కండ్రిక, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో వరద బాధితులకు సుమారు రూ.40 వేల విలువైన పప్పు ధాన్యాలు, కూరగాయలు, పాల ప్యాకెట్లు అందజేశారు.



సాయం అందజేస్తున్న టూవీలర్ మెకానిక్స్..



బాధితులకు వస్తువులు తరలిస్తున్న జీపీఎస్ నిర్వాహకులు

నిత్యావసరాలు..

నగరంపాలెం: ఆపదలో ఉన్న వారికి తమవంతు సహాయం అందించాలని గ్లోరియస్ పాస్టర్ సమూహం గుంటూరు(జీపీఎస్) వ్యవస్థాపకులు పాస్టర్ కోలా ప్రేమ్‌కుమార్ అన్నారు. రైలుపేట నుంచి జీపీఎస్ నిర్వాహకులు ఆహారం, నిత్యావసర వస్తువులు, తాగునీటి సీసాలతో వ్యాన్‌తో సోమవారం విజయవాడ వెళ్లారు. వైఎస్సార్‌కాలనీ, సింగ్‌నగర్‌లో వరద బాధితులకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పాస్టర్ విల్సన్ పాల్గొన్నారు.

22న మిద్దె తోటల పెంపకంపై సదస్సు

కొరిటెపాడు(గుంటూరు): రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన మిద్దెతోట, పెరటి తోటల పెంపకంపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు మునిసిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులుతో పాటు పెరటి, మిద్దె తోటల నిపుణులు పాల్గొంటారని వివరించారు. ఆసక్తి ఉన్న వారు 9705383666 నంబర్‌లో రిజిస్టార్ చేసుకోవాలని కోరారు.

బుద్ధిజం విద్యార్థి మృతి దురదృష్టకరం

ఏఎన్‌యూ: దుగ్గిరాల పరిసరాల్లో పాముకాటుకు గురై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బుద్ధిజం విద్యార్థి కొండన్న మృతి చెందటం దురదృష్టకరమని వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. పుట్టగొడుగులు కోసం వెళ్లి దుగ్గిరాల సమీపంలో శనివారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందిన ఎంఏ బుద్ధిస్ట్ స్టడీస్ విద్యార్థి సంతాప సభ సోమవారం నిర్వహించారు. తొలుత కొండన్న చిత్రపటానికి నివాళులర్పించారు. రెక్టార్ కె.రత్నాషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ స్వరూపరాణి, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ పి.పద్మావతి, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దివ్యతేజోమూర్తి, బుద్ధిజం విభాగాధిపతి ఉదయకుమార్ పాల్గొన్నారు.

కేసు నమోదు..

విద్యార్థి కొండన్న పుట్టగొడుగుల కోసం దుగ్గిరాల మండలం చిలువూరు సమీపంలో వెతుకుతుండగా పాముకాటుకు గురయ్యాడు. దీంతో రిజిస్ట్రార్ సింహాచలం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్ట్ మార్టరం నిర్వహించేందుకు మయన్మార్ దేశం నుంచి పోలీస్ శాఖకు సోమవారం అనుమతి వచ్చింది. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మృతదేహం అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలనే దానిపై తల్లిదండ్రుల నిర్ణయం కోసం వేచిచూస్తున్నారు.